క్లుప్తంగా

సీనియర్ వైద్యులకు సత్కారం



సీనియర్ వైద్యులను సత్కరిస్తున్న రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తదితరులు

అమలాపురం టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులైన అమలాపురానికి చెందిన సీనియర్ వైద్యులు ఎంవీ కృష్ణంరాజు, ఆకెళ్ల కామేశ్వరిలను రాజమహేంద్రవరం ఐఎంఏ హాలులో ఆదివారం రాత్రి జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోనసీమ శాఖ వైద్యులు డాక్టర్ జి.ప్రభాకర్, పెయ్యావుల సురేష్, కొప్పిసెట్టి రమణకుమార్, గోదశి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నసమారాధన

తాళ్లరేవు: మండలంలోని పోలేకుర్రు పంచాయతీ పీడబ్ల్యూడీ కార్యాలయం సమీపంలోని కనకదుర్గ ఆలయం వద్ద దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

రక్తదాతలంటే ప్రాణదాతలే



అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యోగాశ్రమ యువకులు

అమలాపురం టౌన్: రోగులు, క్షతగాత్రులకు అత్యవసర సమయాల్లో రక్తదానమిచ్చేవారు ప్రాణదాతలతో సమానమని స్థానిక స్వామి వివేకానంద యోగాశ్రమం గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆశ్రమంలో శిక్షణ పొందుతున్న ఎం.సత్యవతి, పి.లక్ష్మి, చిత్తూరి దుర్గ, ఎస్.అంబిక, పి.దేవి, ఎం.కార్తీక్, ఎల్.ప్రవీణ్, పి.దుర్గ, ఎస్.మల్లేష్ తదితరులు సోమవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదు రోజుల్లో తమ యోగాశ్రమానికి చెందిన 83 మంది రక్తదానం చేశారని చెప్పారు.

ప్రత్యేక పారిశుధ్య చర్యలు

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. కార్తిక మాసం వస్తుండడంతో భక్తుల దీపారాధనలకు ఆటంకం లేకుండా గ్రామంలోని చెరువును శుభ్రం చేసే చర్యలు ప్రారంభించారు. చెరువులో మహిళలు దీపారాధనల కోసం పాంచాల వద్ద కాంక్రీట్ వేయనున్నట్లు సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సుంకర గోపి, కుడుపూడి సుబ్రహ్మణ్యం, గుత్తుల వెంకటరమణ, బాసు, పరమానందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చొల్లంగి విద్యార్థులు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రాజేశ్వరి, పీడీ నీలిమ

తాళ్లరేవు: మండలంలోని చొల్లంగి హైస్కూల్ విద్యార్థులు ఇటీవల పిఠాపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ పీడీ నీలిమ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ టెన్నిస్‌లో అండర్-17 విభాగంలో కె.ఆకాష్, కె.యువరాణి, అండర్-19 విభాగంలో పరిమళ, లివిష్, దీపాలి, నవీన్‌యాదవ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా పటవల పాఠశాలలో జరిగిన బేస్‌బాల్ పోటీలలో హేమశ్రీ, వి.ప్రసన్న, స్విమ్మింగ్ విభాగంలో అలేఖ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం రాజేశ్వరి ఆయా క్రీడాకారులను అభినందించారు.

కళ్లజోళ్ల అందజేత

అల్లవరం: మండలంలోని బోడసకుర్రులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా సోమవారం కంటి పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైనవారికి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన కళ్లజోళ్లని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. అదే శిబిరంలో బోడసకుర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైతం కళ్లజోళ్లని అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సౌమ్య, అయిలా నాగేశ్వరరావు, బ్రహ్మానందం, కనకదుర్గ పాల్గొన్నారు.

సంస్మరణ సభ

ఉప్పలగుప్తం: ఇటీవల మరణించిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బళ్ల చంటి సంస్మరణ సభను కిత్తనచెరువులోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ బడుగు దొరబాబు చంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, పి.జయరాజు, ఇసుకపట్ల రఘుబాబు, సురేష్ బాబు పాల్గొన్నారు.

డిసెంబర్‌కు వైద్య సేవలు పూర్తి చేయాలి

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ఐదో దశ కార్యక్రమంలో భాగంగా రిఫరల్ కేసులకు సంబంధించి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 26 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష ఐదో దశ, వై ఏపీ నీడ్స్ జగనన్న కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా జగనన్న ఆరోగ్య సురక్ష ఐదో దశ కార్యక్రమాలను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య శిబిరాలలో రిఫర్ చేసిన కేసులను మ్యాపింగ్ చేసి నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలించాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత శస్త్ర వైద్య చికిత్సలు నిర్వహించి రోగులను వారి స్వస్థలాలకు చేర్చాలన్నారు. అనంతరం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నుపూర్ అజయ్

వైద్య సేవలు ఏడాది పాటు అందించాలన్నారు. రానున్న జనవరి ఒకటో తేదీ నుంచి ప్రతి మండలంలో నెలకు నాలుగు వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఆ విధంగా ఆరు నెలలకు ఒకసారి ప్రతి గ్రామాన్ని సందర్శించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ శిబిరాలలో 104 సంచార వాహనం ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది ఇంటింటికి ఆరోగ్య సేవలు, అవసరమైన ఔషధాలు ఉచితంగా అందిస్తారన్నారు. నవంబర్ 9వ తేదీ నుంచి 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమం అధికారులు నిర్వహించాలని ఆమె సూచించారు.

1,87,864 మందికి వైద్య పరీక్షలు

కోనసీమ జిల్లాలో 480 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించి 1,87,864 మందికి వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. వీరిలో 2,130 మందిని రిఫరల్‌గా గుర్తించి ఇప్పటివరకు 97 శస్త్ర చికిత్సలు పూర్తి చేశామన్నారు. ఈ వైద్య శిబిరాలలో 100 మంది స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొన్నారన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి 47,537 మందికి పరీక్షలు నిర్వహించి 1,991 మందిని క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి, 230 మందికి శస్త్ర చికిత్సలు పూర్తి చేశామన్నారు. 2,384 మందికి కళ్ల అద్దాలు ఉచితంగా అందించామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, సీపీవో వెంకటేశ్వర్లు నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సుమలత, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ఆండ్రోస్, ఎన్సీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాన్ వెస్లీ, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారిని డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- మత్స్యకార గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంక, చింతావానిరేవు, కర్రివానిరేవు, అన్నంపల్లి పంచాయతీ చింతపల్లిలంక, నగర పంచాయతీ కొత్తకాలనీలోని మత్స్యకార గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజలు వాడవాడలా ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పాలన అందజేస్తూ 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు మట్టపర్తి సత్యనారాయణ, కాశి భాగ్యలక్ష్మి, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, పెన్మత్స చిట్టిరాజు, కాశి జగపతిరావు, పెసింగి నూకరాజు, చింతా నాగమునీంద్రరావు, మోర్త శ్రీరామచంద్రమూర్తి, గిరిగి కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.



కర్రివానిరేవులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ఘనంగా మహీవరాహ హోమం



మున్సిపల్ కల్యాణ మంటపంలో జరిగిన హోమానికి హాజరైన భక్తులు

యానాం: పర్యావరణ పరిరక్షణ కోసం కోటి గోక్షీరష మహాయజ్ఞంలో భాగంగా సోమవారం రాత్రి స్థానిక వేంకటేశ్వరస్వామి వారి బాలాలయం సమీపంలో మున్సిపల్ కల్యాణ మంటపంలో మహీవరాహ హోమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆవు పిడకలు, ఆవునేతితో గోఉపాసక కందుర్తి మహీ కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ హోమానికి యానాం పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి రోజు పదివేల పిడకలతో హోమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్మరణం

అమలాపురం టౌన్: విధులకు హాజరయ్యేందుకు బయలుదేరిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమలాపురం బైపాస్ రోడ్డులో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ప్రమాదంలో పి.గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో అంగన్ వాడీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న అమలాపురం బి.సావరానికి చెందిన గూడూరి రామలక్ష్మి (45) ప్రాణాలు కోల్పోయింది. పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ చెప్పిన వివరాల ప్రకారం... రామలక్ష్మి విధులకు హాజరయ్యేందుకు తన భర్త సురేష్‌తో కలిసి స్కూటీపై బయలుదేరింది. వారి ఇంటికి సమీపంలోని ఈదరపల్లి బైపాస్ రోడ్డుకు వచ్చే సరికి వారి స్కూటీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొట్టడంతో రామలక్ష్మి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త సురేష్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదంలో భర్త సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కళ్లెదుటే భార్య మృతి చెందడంతో భర్త సురేష్ గుండెలవిసేలా రోదించాడు. చదువుకుంటున్న తమ కూతురు, కుమారుడు అమ్మ ఏది అని అడిగితే వారికి ఏం సమాధానం చెప్పాలంటూ గగ్గోలు పెట్టాడు. రామలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



రామలక్ష్మి మృతదేహం

జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- ఉప్పలగుప్తంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయాలను ఏర్పాటుచేసి గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల ఒకటో తేదీన కోడి కూతకు ముందే పింఛన్, రేషన్ ఇంటింటికీ అందిస్తున్న ఘనత మన జగనన్నదే అని వివరించారు. అందరికీ అందుబాటులో ఉండేలా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, ఉప సర్పంచ్ మోకా శ్రీను, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడబాల మాధవ, జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, జగనన్న సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యిల రమణ, మోటూరి సత్యంకాపు, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, యనమదల పల్లంరాజు, చేట్ల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో సంక్షేమ వివరాలను లబ్ధిదారునికి వివరిస్తున్న శ్రీకాంత్

సమనసలో మొసలి ప్రత్యక్షం

- కాల్వ లోంచి అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్డుపైకి..
- వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్
- లాకుల వద్ద గాలింపు చర్యలు..
- ఫలించని ప్రయత్నం

అమలాపురం రూరల్: అమలాపురం ప్రధాన పంట కాల్వలో సంచరిస్తూ, దాదాపు 45 రోజులుగా ఆ ప్రాంత ప్రజలను బెంబేలెత్తిస్తూ చిక్కకుండా తప్పించుకుంటున్న మొసలి సమనస లాకుల వద్ద ప్రత్యక్షమైంది. లాకుల వద్ద ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మొసలి రోడ్డుపైకి రావడంతో ఆ దృశ్యాన్ని స్థానిక యువకులు కొందరు వీడియో తీశారు. అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగి మొసలిని పట్టుకునేందుకు మరోసారి సమనస లాకుల వద్ద కాల్వలో జల్లెడ పట్టారు. తొలుత నడిపూడి లాకుల నుంచి అమలాపురం ఎర్రవంతెన మధ్య కాల్వలో మొసలి సంచరిస్తోందని స్థానికులు గుర్తించి అధికారులకు చెప్పడంతో 45 రోజుల కిందటే మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు కాల్వలోకి ఎవరూ దిగవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. సమనస లాకుల వద్ద మొసలి ఉందన్న నిర్ధారణకు రావడంతో సోమవారం ఉదయం అటవీ శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి దిగారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సమనసలో మొసలిని రోడ్డుపై చూసిన యువకులు తక్షణమే అమలాపురం రూరల్ పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులు ఆ సమయంలో సమనసకు వచ్చి పరిస్థితిని సమీక్షించినా అప్పటికే మొసలి రోడ్డుపై నుంచి కాల్వలోకి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం అటవీ శాఖ అధికారులు కాల్వలో గాలిస్తూ బోనును కూడా సిద్ధం చేశారు. అమలాపురం తాలూకా ఎస్సై ఎ.పరదేశి ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎవరూ కాల్వలోకి దిగవద్దని ప్రకటన విడుదల చేశారు. సమనస లాకుల వద్ద మొసలి కనిపించిందన్న సమాచారంతో లాకుల వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకుని అటవీ శాఖ సిబ్బంది చేస్తున్న ప్రయత్నాలను ఉదయం నుంచి రాత్రి వరకూ ఉత్కంఠగా తిలకిస్తూనే ఉన్నారు. మొసలిని పట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు.



సమనస కాల్వ వద్ద సిద్ధం చేసిన బోనును పరిశీలిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అమలాపురం రూరల్: ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వి.హేమంత్ ఈ నెల 9, 10, 11 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా హేమంత్‌ను సర్పంచ్ బొల్లంగి శివాణి, ఉపాధ్యాయుడు పెద్దిరాజు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆకేటి వెంకట రవితేజ, చల్లా దుర్గాగణేష్‌లు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ కామన మధుసూదనరావు సోమవారం తెలిపారు. ఇటీవల అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన ఎంపికల్లో తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 17 నుంచి గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీఎంసీ చైర్మన్ సబ్బతి జ్యోతి, హెచ్ఎం నూకల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు విద్యార్థులను అభినందించారు.



క్రీడా పోటీల్లో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది



హేమంత్

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

ఐ.పోలవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సును దిశ ఎస్‌ఐ రాజ్యలక్ష్మి సోమవారం నిర్వహించారు. దిశ మహిళా సేఫ్టీలో భాగంగా దిశ యాప్ రిజిస్ట్రేషన్, చైల్డ్ పోర్నోగ్రఫీ, పీఓసీఎస్‌వో యాక్ట్, సైబర్ క్రైమ్ రిలేటెడ్ కేసెస్, లోన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి

అల్లవరం: గ్రామాల్లోని సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ సెంటర్లు తదితర ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు చెందిన సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ 9 నుంచి ప్రారంభం కానున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్లు, నీటి కనెక్షన్లపై ఇన్‌చార్జ్ ఏఈ హరిబాబు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఏపీఓ శ్రీనుబాబు, కార్యదర్శులు ఎన్‌వీవీ సత్యనారాయణ, చిక్కం శ్రీను, ఎ.రాజా, శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీడబ్ల్యూడీ ఎన్‌ఎంఆర్‌ల ధర్నా

యానాం: యానాం ప్రజాపనుల శాఖ(పీడబ్ల్యూడీ)లో గత 13 ఏళ్లుగా పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక పీడబ్ల్యూడీ ఆఫీసు ఎదుట ఎన్‌ఎంఆర్‌లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా 1500 మంది ఎన్‌ఎంఆర్‌లు ఉన్నారని వయసుతో కూడిన సీనియారిటీ ఇవ్వాలని, ఎంటీఎస్ పోస్టులను భర్తీ చేయాలని, రోజువారీ వేతనం రూ.852 చేసి 26 రోజుల పనిదినాలు ఉండేలా చేయాలని కోరారు. ఇందిరాగాంధీ మెడికల్ కళాశాల సిబ్బందిని పర్మినెంట్ చేసి రూ.38 వేలు అందజేస్తున్నారని, అలాగే తమకు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శరవణన్, కార్యదర్శి కర్రి నాగబాబు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న పీడబ్ల్యూడీ ఎన్‌ఎంఆర్‌లు

రూ.84 లక్షలతో గురుకులంలో మౌలిక సౌకర్యాలు

- 45 రోజుల్లో పనులు పూర్తి చేయాలి
- పురోగతిపై ప్రతి రోజూ నివేదిక ఇవ్వాలి
- సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య ప్రిన్సిపల్ కార్యదర్శి జయలక్ష్మి

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.84 లక్షలు మంజూరు చేశామని, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. గోడి గ్రామంలోని బాలుర గురుకులాన్ని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌తో కలిసి సోమవారం ఆమె సందర్శించారు. తొలుత బాలుర గురుకుల పాఠశాలను, నాలుగు టాయిలెట్ బ్లాక్‌లను, విద్యార్థులకు ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల వసతి గృహాన్ని (డార్మెటరీ), అందులోని మూడంతస్తుల్లో ఉన్న మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. డైనింగ్ హాల్‌ను, ఆర్ఓ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ, పాఠశాల, డార్మెటరీలో లోపాలను గుర్తించి ప్రతిపాదించిన పనులను 45 రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈ రాజ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీఈ సుబ్బరాజును ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి రోజూ నివేదిక ఇవ్వాలని చెప్పారు. మరుగుదొడ్ల మరమ్మతులు, తలుపులు, వాటర్ పైపులైన్, విద్యార్థులకు అందించే తాగునీరు, సైట్ ఫిల్లింగ్ పనులను పీఆర్ విభాగానికి అప్పగించారు. విద్యుత్, వైర్లు, ఫ్యాన్లు, కిటికీలు, పెయింటింగ్ పనుల బాధ్యతను సాంఘిక సంక్షేమ శాఖకు అప్పగించారు. ఈ పనులపై ప్రతి రోజూ సీనియర్ అధికారుల పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. టాయిలెట్లకు రన్నింగ్ వాటర్ సప్లయ్ ఉండాలని సూచించారు. అలాగే విద్యార్థులకు ఎటువంటి చర్మ వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్యామ్‌ప్రసాద్‌ను ఆదేశించారు. విద్యార్థుల అవసరాలకు సరిపడా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారని జయలక్ష్మి చెప్పారు. అనంతరం ఆమె బాలికల గురుకులాన్ని సందర్శించారు. పాఠశాల, డార్మెటరీలోని టాయిలెట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కిచెన్‌లో భోజనాలు తయారు చేసే విధానాన్ని, స్టోర్ రూమ్‌ను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా పీఆర్, సోషల్ వెల్ఫేర్ డీఈలతో మాట్లాడుతూ, బాలికల గురుకులంలో ఏమైనా సమస్యలుంటే గుర్తించి, ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఆమె వెంట డీసీఓ రాజకుమారి, సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి జ్యోతిలక్ష్మీదేవి, తహసీల్దార్ సాంబశివప్రసాద్ తదితరులు ఉన్నారు.



మౌలిక సౌకర్యాల కల్పనపై అధికారులకు సూచనలిస్తున్న జయలక్ష్మి

పాఠశాలలకు కుర్చీలు, కంచాల వితరణ



పాఠశాల హెచ్ఎం నూర్జహాన్ బేగమ్‌కి కంచాలను అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

అల్లవరం: రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు, మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో గోడిలంక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు మధ్యాహ్న భోజనాలు తినేందుకు అవసరమైన కంచాలు, పాఠశాలకు కుర్చీలను సోమవారం అందించారు. ట్రస్టు అధ్యక్షులు రుద్రరాజు రమేష్‌రాజు, మోసుగంటి వెంకటేశ్వరరావులు సంయుక్తంగా రూ.12 వేలు విలువ చేసే సామగ్రిని పాఠశాల హెచ్ఎం నూర్జహాన్ బేగమ్‌కి అందజేశారు. కార్యక్రమంలో రమా సత్యవతి, విజయకుమారి, గణేష్, మంజుల, సత్యనారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సొమ్ము జమ

యానాం: నియోజకవర్గ పరిధిలో ఉన్న మొత్తం 1,690 మంది భవన నిర్మాణ కార్మికులకు దీపావళిని పురస్కరించుకుని ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున మొత్తంగా రూ.67.60 లక్షలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో కార్మికులకు ఒక్కొక్కరికి రూ.3,500 ఇచ్చేవారని, ఆ మొత్తాన్ని పెంచాలన్న తన అభ్యర్థన మేరకు రూ.4,000 చేశారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

నేటి నుంచి వాటర్ ఫర్ వుమెన్ శిక్షణ

యానాం: ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకూ యానాంలోని స్వయం సహాయక గ్రూపులకు వాటర్ ఫర్ వుమెన్, వుమెన్ ఫర్ వాటర్ శిక్షణ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అరుణ్ ప్రకాశం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమృత్ మిషన్, ఎన్‌యూఎల్ఎం పథకాల లక్ష్యాలను మహిళలకు వివరిస్తామన్నారు. యానాం నియోజకవర్గ పరిధిలో తాగునీటి ప్రాధాన్యత, అవసరాలు, వాటర్ టెస్టింగ్, తాగునీటి వ్యవస్థ తదితరాల గురించి గృహిణుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ముందుగా దరియాలతిప్ప, కనకాలపేట, నల్లచెరువు వద్ద ఉన్న రక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థ వద్ద శిక్షణ ఇస్తామన్నారు.

మాజీ స్పీకర్ కన్నన్ మృతికి సంతాపం

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ మాజీ స్పీకర్ కన్నన్(74) సోమవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఎల్జీ తమిళిసై సౌందరాజన్, సీఎం రంగసామి, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సందర్శించి నివాళులర్పించారు. యువకుడిగా ఉన్నప్పుడే రాజకీయాల్లో ప్రవేశించిన కన్నన్ హోంమంత్రి, స్పీకర్, పార్లమెంట్ సభ్యుడిగా వివిధ హోదాలను అధిష్టించారని రంగసామి పేర్కొన్నారు. యానాం నియోజకవర్గంలో అనేకసార్లు ఆయన పర్యటించారని ఈ ప్రాంత అభివృద్ధికి కన్నన్ సహకరించారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చెప్పారు. ఈ సందర్భంగా కన్నన్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరప్పాడులో ఎంపీయూపీ స్కూల్‌లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అధికారులను కోరారు. ఎమ్మెల్సీ సోమవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండడం గమనించారు. అసంపూర్తిగా ఉన్న బాత్‌రూమ్ నిర్మాణాన్ని పూర్తి చేయవలసిందిగా ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఎంఈవో జి.సూర్యప్రకాశాలకు విజ్ఞప్తి చేస్తూ లేఖలు రాశారు.

పేకాట క్లబ్‌లు నిలుపుదల చేయాలి

యానాం: నియోజకవర్గ శివారు దొమ్మేటిపేటలో తిరిగి ప్రారంభమైన పేకాట క్లబ్‌ను నిలుపుదల చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఆర్ఏఓ మునిస్వామిని కలిసి క్లబ్‌ల సమస్యపై మాట్లాడారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అరుణ్ ప్రకాశం, ఎస్పీ రఘునాయగంను ఆర్ఏఓ ఆఫీసుకు రప్పించి చర్చించారు. పర్యాటక కేంద్రంగా ఉన్న యానాంలో పేకాట క్లబ్‌లతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతాయన్నారు. ఇప్పటికే దొమ్మేటిపేటలో ప్రారంభమైన రాయల్ రిక్రియేషన్ క్లబ్‌తో పాటు మరో 5 పేకాట క్లబ్‌లు తెరిచేందుకు ఇప్పటికే రంగం సిద్ధమైందని వాటిని సైతం నిలుపుదల చేయాలని కోరారు. వీటిపై సీఎం రంగసామి, ఎల్జీ తమిళిసై దృష్టికి తీసుకువెళతానన్నారు.